



# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

శుక్రవారం, ఆగస్టు 22, 2025

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-


## రాజ్యాంగవ్యవస్థలు పనిచేయకుంటే ఆ పని కోర్టులే చేస్తాయి



న్యూఢిల్లీ: రాష్ట్రాల బిల్లులకు ఆమోదం తెలపడంపై గవర్నర్లకు, తనకు గడువు నిర్దేశిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సుప్రీంకోర్టు అభిప్రాయం కోరిన అంశంపై గురువారం సైతం రాజ్యాంగ ధర్మాసనం విచారణ కొనసాగింది. ఈ సందర్భంగా కేంద్రప్రభుత్వానుద్దేశిస్తూ పలు వ్యాఖ్యలు చేసింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్ సేథ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ ఏఎస్ చందూ ర్కర్‌ల రాజ్యాంగ ధర్మాసనం ఈ అంశంపై వాదనలను ఆలకిస్తూ ఈ వ్యాఖ్యలుచేసింది. "రాజ్యాంగబద్ద సంస్థలు తమ విధులను నిర్వర్తించకుండా నిర్లక్ష్యవహించినా, రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా గవర్నర్ నిష్క్రియాపరత్వం

(మిగతా 2వ పేజీలో)

## నాపై కక్ష గట్టారు.. ఎమ్మెల్సీ కవిత సంచలన లేఖ






## విద్యా ప్రమాణాల మేరకే ఫీజుల పెంపు

హైదరాబాద్ : ఇంజినీరింగ్, వృత్తివిద్యా కాలేజీల్లో ఫీజుల పెంపుపై రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కళాశాలలు అందించే అకౌంట్స్‌తో పాటు ఆయా కళాశాల్లో విద్యా ప్రమాణాలను పరిగణలోకి తీసుకొని ఫీ జులు నిర్ధారించాలని నిర్ణయించింది. ఈ మేర కు ఫీజుల పెంపునకు సంబంధించిన నిబంధన ల్లో మార్పులు చేస్తూ గురువారం ప్రభుత్వం ఉ త్తర్వులు జారీ చేసింది. ఇంజినీరింగ్, వృత్తి వి ద్యా కళాశాలల్లో విద్యార్థుల హాజరు, ఫేషియల్ రికగ్నిషన్ అమలు, ఆధార్ ఆధారిత ఫీజుల చె ల్లింపులు సహా విద్యార్థులను పరిశోధనలవైపు ప్రోత్సహిస్తున్నారా అనే అంశాల్ని పరిగణలోకి తీసుకోనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. కాలేజీ లు నాణ్యమైన విద్య అందిస్తున్నాయా? ఆ కాలేజిల్లో విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ ఎలా ఉన్నా యి? అనే అంశాలపైనా దృష్టి సారించనుంది. జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్‌లు, ప్రభుత్వ నిబంధనలను ఏ మేరకు అమలు చేస్తున్నారనే అంశాలను పరిశీలించిన తర్వాతే కళాశాలల్లో ఫీజులను నిర్ధారించనున్నట్టు ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇంజినీరింగ్, వృత్తి విద్యా కాలేజీల్లో ఫీజుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఫీజు నిబంధనలకు సవరణలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బోధనా ప్రమాణాలు, నిబంధనలు అమలు ఆధారంగా ఫీజుల పెంపునకు అనుమతి ఇచ్చింది. నాణ్యమైన బోధన, ప్లేస్‌మెంట్లు, విద్యార్థుల హాజరు, పరిశోధనలకు ప్రోత్సాహం ఆధారంగా ఫీజుల పెంపునకు పచ్చ జెండా ఊపింది. ఆధార్ ఆధారిత చెల్లింపులు, నిబంధనల అమలు ఆధారంగా ఫీజుల పెంపునకు అవకాశం కల్పించింది. అయితే ఈ ఏడాది పాత ఫీజులనే కొనసాగించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఫీజులు పెంచాలని కొన్ని కళాశాలలు హైకోర్టును

(మిగతా 2వ పేజీలో)

## అకాల వర్షాలతోనే కుంగింది

### డిజైనింగ్ కానీ ఇంజనీరింగ్‌తో కానీ ఎలాంటి సంబంధం లేదు

### జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిబంధనలు పాటించలేదు

### హైకోర్టులో కెసిఆర్ తరపు న్యాయవాది వాదనలు



హైదరాబాద్ : కాళేశ్వరం ప్రా జెక్టుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, అది తమకు రాజకీయంగా నష్టం చే కూర్చేలా తయారు చేసిందని మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు తరపు న్యాయవాదులు గురువారం జరిగిన విచారణ సందర్భంగా ఆరోపించారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను రద్దు చేయాలని కోరుతూ, కేసీఆర్, హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్లపై గురువారం హైకోర్టులో వాడివేడిగా విచారణ జరిగింది. రెం డు పిటిషన్లను కలిపి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ బెంచ్ విచారించింది. ఐదు అంశాలను ప్రధానంగా పిటిషన ర్లు ప్రస్తావించారు. కాళేశ్వరం కమిషన్‌ను నియమిస్తూ గత ఏడాది ప్రభుత్వం జారీ చేసిన జీఓ ను కొట్టివేయాలని కోరారు. కమిషన్ విచారణ లో సందర్భంగా యాక్ట్ సెక్షన్ 8బి, 8సి నోటీసు లు తమకు ఇవ్వలేదని పేర్కొన్నారు. కమిషన్ ప్ర భుత్వానికి ఇచ్చిన నివేదికను తమకు ఎందుకు ఇవ్వలేదని పిటిషనర్ల తరపున వాదించిన సుప్రీంకోర్టు న్యాయవాది ఆర్యామ సుందరం ప్రశ్నించారు.

**కెసిఆర్ తరపు న్యాయవాది వాదనలు**

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నిబంధనలు పాటించలేదని న్యాయవాది సుందరం తెలిపారు. నోటీసులు సరైన విధానంలో ఇవ్వలేదని వాదించారు. నివేదికను కూడా కెసిఆర్, హరీష్ రావుకు అందించలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్ళారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదికను ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చిందని ఆయన తెలిపారు. రాజకీయంగా నష్టం చేకూర్చేలా నివేదిక రూపొందించారని అన్నారు. ఈ నివేదికపై అసెంబ్లీలో చర్చించేలా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళిక

(మిగతా 2వ పేజీలో)



## 'తెలంగాణ ఇచ్చిన పార్టీ థర్డ్ గ్రేడ్ పార్టీనా?

::: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



## బీఆర్ఎస్ మద్దతు అవసరం లేదు

::: కేంద్రమంత్రి కిషన్ కిషన్‌రెడ్డి



## పార్లమెంట్ నిరవధిక వాయిదా

పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గురువారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. నెలరోజుల ఈ సమావేశాలు ఆరంభం నుంచి కీలకమైన చర్చలకు వీల్లేకుండా, అత్యంత కీలకమైన దైనందిన ప్రజా సమస్యల ప్రస్తావన లేకుండా ముగిశాయి. సెషన్ జులై 21న ఆరంభం అయింది. బీహార్ అసెంబ్లీ ఎన్నికల సంబంధిత ఓటర్ల జాబితా సవరణల (సర్) అంశం ఆది నుంచి అంతం వరకూ వివాదాస్పదం అయింది. ఈ సర్ ప్రక్రియ ద్వారా పెద్ద ఎత్తున ఓట్లచోరీ జరిగిందని, దీనిపై ముందుగా చర్చ జరగాల్సిందేనని కాంగ్రెస్ సారథ్యంలో ఆప్ మినహా ఇతర పార్టీలు ఒక్కటిగా నిలిచి పట్టుపట్టాయి. అయితే ఎన్నికల సంఘం వ్యవస్థాగత అంశం. పైగా దీనిపై విచారణ ఇప్పుడు కోర్టు పరిధిలో ఉంది కాబట్టి ప్రస్తావన కుదరదని ప్రభుత్వం స్పష్టం చేయడంతో ఉభయ సభలు దాదాపుగా ప్రతి రోజు వాయిదా పడుతూ వచ్చాయి. సభ్యుల నినాదాలు, పరస్పర ఆరోపణల నడుమ చివరికి వాకౌట్ల మధ్యనే ప్రభుత్వం 14 బిల్లులను ప్రవేశపెట్టింది. వీటిలో 12 బిల్లులకు ఆమోదం దక్కింది. అత్యంత కీలమైన

(మిగతా 2వ పేజీలో)

## బీజేపీ, డీఎంకేలతో పొత్తు ప్రశ్నే లేదు

### నటుడు, టీవీకే చీఫ్ విజయ్

### సీఎం స్టాలిన్‌కు పలు ప్రశ్నలు

### మదురైలో జరిగిన సభకు భారీగా జనం



చెన్నై: సింహం ఎప్పటికీ సింహంగానే ఉంటుందని నటుడు, తమిళగ వెట్రి కళగం పార్టీ చీఫ్ విజయ్ స్పష్టం చేశారు. బీజేపీ, డీఎంకేలతో ఎన్నికల పొత్తు పెట్టుకోబోమని, ఆ రెండు పార్టీలు తమకు బద్ధ శత్రువులని విమర్శించారు. ఆత్మగౌరవంతోనే ముందుకు సాగుతామన్నారు. తమిళనాడులోని మదురైలో గురువారం జరిగిన పార్టీ రెండో మహాసభకు పెద్ద ఎత్తున జనం హాజరయ్యారు. 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు మద్దతు కూడగట్టుకోవడమే లక్ష్యంగా ఏర్పాటైన ఈ సభలో ఆయన ప్రసంగించారు. తమ రాజకీయ శత్రువు డీఎంకే కాగా, సైద్ధాంతిక శత్రువు బీజేపీ అని పేర్కొన్నారు. టీవీకే ఎవరికీ భయపడదు, మాఫియా వ్యాపారాలు చేయదు అని

(మిగతా 2వ పేజీలో)



## దక్షిణాదికి న్యాయం చేయండి

### ::: నిర్మలా సీతారామన్‌తో భట్టి విక్రమార్క భేటీ

హైదరాబాద్ : తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర దక్షిణ రాష్ట్రా లు దేశ ఆదాయానికి గణనీయంగా సహకరిస్తున్నప్పటికీ, జాతీయ ఆదాయంలో వాటి వా టాకు తగిన విధంగా నిధుల పంపిణీ జరగ డం లేదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేసారు. తమకు జరిగే అ న్యాయాన్ని భర్తీ చేసేందుకు ప్రస్తుతం అమలులో ఉన్న పరిహార సెస్సు కొనసాగించి, దా నివల్ల సమకూరే మొత్తాన్ని పూర్తిగా ఆయా రాష్ట్రాలకు ఇవ్వాలని ప్రతిపాదించారు. జీఎస్ టి కౌన్సిల్ ఏర్పాటు చేసిన గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌లలో సభ్యుడైన భట్టి విక్రమార్క, గురువా రం

(మిగతా 2వ పేజీలో)

# అకాల వర్షాలతోనే కుంగింది

రూపొందించిందన్నారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని కోర్టును కోరారు. ఎలాంటి ఆధారాలు లేకుండా బిఆర్ఎస్‌ను అప్రతిష్టపాలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని పిటిషనర్ తరుపు న్యాయవాది పేర్కొన్నారు. రాజకీయ వ్యూహంతోనే జస్టిస్ ఘోష్ కమిషన్ నియామకం జరిగిందని వెల్లడించారు. నిబం ధనలకు విరుద్ధంగా కమిషన్ నివేదిక రూపొందించిందని వివరించారు. దురదృష్టవశాత్తూ వివిధ కారణాలతో మేడిగడ్డ బ్యారేజ్ ఒక పిల్లర్ కుంగిందని, అదికూడా వర్షాకాలంలో అకాల వర్షాలు కారణంగా కుంగిందని తెలిపారు. కుంగిపోవడానికి డిజైనింగ్ కానీ ఇంజనీరింగ్‌తో కానీ ఎలాంటి సంబంధం లేదని పిటిషనర్ల న్యాయవాది స్పష్టం చేశారు. నివేదిక కాపీలను తమకు అందజేయకుండా మీడి యాకు అందజేయడంలో దురుద్దేశం కూడుకున్నదని కోర్టుకు వివరించారు. రాజకీయ కారణాలతో ప్రజల్లో తమ పరువును అప్రతిష్టపాలు చేయాలని చూస్తున్నారని అన్నారు. ఒకవేళ ఏదైనా ఎంక్వైరీ కమిషన్ లో వ్యక్తి పై ఆరోపణలు ఉంటే సెక్షన్ 8 బి నోటీస్ ఇవ్వాలి. కమిషన్ ఎంక్వయిరీ యాక్ట్ సెక్షన్ 8బి, 8సి నోటీసులు ఇవ్వలేదని, ఎలాంటి కాపీ తమకు ఇవ్వకుండానే జూలై 31 న ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందని కోర్టుకు వివరించారు. ప్రభుత్వం 600 పేజీల రిపోర్ట్ ను స్టడీ చేసి బ్రీఫ్ రిపోర్ట్ ఇవ్వాలని త్రీ మెన్ కమిటీ వేసిందని, వాళ్ళు ఇచ్చిన 60 పేజిల రిపోర్ట్ కూడా మాకు ఇవ్వలేదని కోర్టుకు తెలిపారు. మొత్తం రిపోర్ట్ కాకుండా 60 పేజీల రిపోర్ట్ మాత్రమే వెబ్‌సౌట్‌లో అప్లోడ్ చేశారని వెల్లడించారు. ప్రభుత్వ వెబ్ సైట్ లో 60 పేజీల రిపోర్ట్ ను డౌన్లోడ్ చేసుకున్నామని చెప్పారు. దీని మీద ముఖ్యమంత్రి సహా మంత్రులు మీడియా సమావేశాలు ఏర్పాటు చేశారని, పవర్ పాయింట్ ప్రెజెం టేషన్ కూడా ఇచ్చారన్నారు. అన్ని మీడియాల్లో కమిషన్ రిపోర్ట్ ను డిస్ ప్లే కూడా చేశారని, తమకు ఎలాంటి 8బి నోటీస్ ఇవ్వలేదు కాబట్టి ఈ నివేదిక చెల్లదని సుందరం వాదించారు. ఈ నివేదిక ను అడ్డం పెట్టుకుని అనేక చర్యల కు పాల్పడే అవకాశం ఉందని, కమిషన్ నివేదికతో తన క్లయింట్ మీద చర్యలు తీసుకునేలా ప్రభుత్వం వ్యవహరించ వచ్చని, లీగల్ గా కూడా ప్రభుత్వం ముందుకు వెళ్ళే అవకా శం ఉందని అనుమానం వ్యక్తం చేసారు. పై కారణాలతో ఈ కమిషన్ నివేదికను పూర్తిగా కొట్టివేయాలి అని న్యాయవాది సుందరం కోరారు. పిటిషనర్ల తరపు వాదనల అనంతరం నివేదిక ప్రతిని పిటిషనర్లకు ఎందుకు ఇవ్వలేదని హైకోర్టు ధర్మాసనం ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించగా, ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ (ఏజీ) సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించారు.పిటిషన్లర్లు అసెంబ్లీలో సభ్యులే కదా నివేదిక వారికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించింది. నివేదికను గోప్యంగా ఉంచాలనుకుంటే, అలాంటప్పుడు ఎందుకు బ యట పెట్టారని హైకోర్టు ప్రశ్నించింది.సీఎం నిర్వహించిన మీ డియా సమావేశంలో జర్నలిసుల్టకు 60 పేజీల నివేదిక అంద జేశారని సుందరం కోర్టు దృష్టికి తీసుకవెళ్లారు. కోర్టుకు సమ ర్పించిన ప్రతులు సరిగ్గా కనిపించడం లేదని హైకోర్టు పేర్కొం ది. నివేదిక ప్రతులు సరిగ్గా కనిపించేలా ఇచ్చిన తర్వాతనే విచారణ చేస్తామని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసు ప్రాధాన్యత దృష్ట్యా ఈరోజే విచారణ కొనసాగించాలని కెసిఆర్ తరుపు న్యాయవాది సుందరం కోరారు. కమిషన్ తరపున అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వాదనలు వినిపించగా,. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక అధికారికంగా విడుదల చేశారా? అని అడ్వకేట్ జనరల్‌ను హైకోర్టు ప్రశ్నించింది. హైకోర్టు సూటీగా ప్రభుత్వాన్ని మూడు ప్రశ్నలు వేసింది.



నివేదిక కాపీను పబ్లిక్ డొమైన్లో పెట్టారా..? పిటిషనర్లకు 8బీ కింద నోటీసులు ఇచ్చారా? లేదా..? కమిషన్ నివేదిక ప్రస్తుత పరిస్థితి ఏంటి..? అని ప్రశ్నించింది. తాము 8బీ కింద నోటీస్ ఇచ్చినట్లు అడ్వకేట్ జనరల్ వివరించారు. సెక్షన్ మెన్షన్ చేయనంత మాత్రాన అది 8 బీ నోటీస్ కాదంటే ఎలా అని అడ్వకేట్ జనరల్ ప్రశ్నించారు. ఈ నివేదికపై అసెంబ్లీలో ప్రభుత్వం చర్చించకు పెట్టనుందని పేర్కొన్నారు. దానిని సభలో చర్చించాల్సిందేనని అడ్వకేట్ జనరల్ పేర్కొంటూ, కిరణ్ బేడి కేసుకు ఈ కేసుకు తేడాలు ఉన్నాయని గుర్తు చేసారు. కాళేశ్వరం రిపోర్టును తాము ఎక్కడా పబ్లిక్ డొమెన్లో పెట్టలేదని అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. అసెంబ్లీలో చర్చించాకే పబ్లిక్ డొమైన్లో పెడతామని తెలిపారు. కౌంటర్లో మరిన్ని వివరాలు పొందపరుస్తామని చెప్పారు. ఈ దశలో కమిషన్ నివేదికపై ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయొద్దని హై కోర్టుకు ఏజీ విజ్ఞప్తి చేసారు. అసెంబ్లీలో ఈ నివేదికపై చర్చిం చాక తదుపరి విచారణ చేపట్టాలని అడ్వకేట్ జనరల్ ధర్మాస నాన్ని కోరారు. కమిషన్ నివేదిక ప్రస్తుతం ఏ దశలో ఉందని హైకోర్టు అడ్వకేట్ జనరల్‌ను ప్రశ్నించింది. ప్రజాధనం దుర్వి నియోగాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ కమిషన్ను ప్రభుత్వం నియమించిందని ఏజీ వివరించారు. కమిషన్ నివేదికను మంత్రులకు సులభంగా అర్థం కావడానికి సంక్షిప్తంగా 60పేజీల నివేదిక రూపొందించి ఇచ్చినట్టు అడ్వకేట్ జనరల్ తెలిపారు. 60పేజీల నివేదిక ఆధారంగా ఘోష్ కమిషన్ నివేదికను కేబినెట్ ఆమోదించినట్టు ఏజి వివరించారు. అసెంబ్లీలో చర్చించి తదుపరి చర్యలు తీసుకునేలా కేబినెట్ నిర్ణయం తీసుకుందని ఏజీ వివరించారు. అసెంబ్లీలో చర్చించే వరకు ఈ పిటిషన్ల విచారణ చేపట్టవద్దని ఏజీ కోరారు. ఈ పిటీషన్లపై కౌంటర్ దాఖలు చేయడానికి సమ యం కావాలని ఏజీ కోరారు. సెక్షన్ 8బీ కింద నోటీసులు ఇవ్వలేదని పిటీషనర్లు తప్పుపట్టడం చెల్లదని ఏజీ పేర్కొ న్నారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను ఎప్పుడు అసెంబ్లీలో ప్రవేశ పెడుతారని హైకోర్టు ప్రశ్నించింది. ఈ నివేదికపై చర్యలు తీసుకున్నాక అసెంబ్లీలో పెడతారా..? లేక ప్రవేశపెట్టకముందే చర్యలు తీసుకుంటారా? అని ప్రశ్నించింది. ఆ సమాచారం లేదని ఏజీ కోర్టుకు తెలపగా, ఆ విషయం తెలుసుకోండని అని సూచిస్తూ, విచారణను శుక్రవారానికి వాయిదా వేస్తున్నట్టు ధర్మాసనం ప్రకటించింది.

# రాజ్యాంగవ్యవస్థలు పనిచేయకుంటే ఆ పని కోర్టులే చేస్తాయి



చూపినా సరే తాము చేతులు కట్టుకుని కూర్చోవాలా?" అని కేంద్ర తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను సూటిగా ప్రశ్నించింది. దీనిపై మెహతా బదులిచ్చారు. "అసెంబ్లీలు ఆమోదించి పంపిన బిల్లులపై ఎటూ తేల్చకుండా గవర్నర్ వాటిని అలాగే తనవద్దే అట్టిపెట్టుకుంటే అలాంటి సందర్భాల్లో రాష్ట్రాలే రాజకీయ పరిష్కారాలను వెతకాలి. అంతేగానీ న్యాయస్థానాల నుంచి పరిష్కారాలను ఆశించకూడదు. సమస్య పరిష్కారానికి సంప్రతింపుల మార్గంలో వెళ్లాలి. చర్చలకే తొలి ప్రాధాన్యత దక్కాలి" అని అన్నారు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్ జోక్యంచేసుకున్నారు. " మీరన్నట్లు చర్చలకు సిద్ధపడకుండా ఏదైనా రాష్ట్రంలో ప్రభుత్వం మా వద్దకొస్తే మేమేం చేయాలి?" అని ప్రశ్నించారు. దీనికి బదులుగా మెహతా.. " ఇలాంటి సందర్భాల్లో ప్రతి ఒక్క ముఖ్యమంత్రి కోర్టులను ఆశ్రయిస్తారని నేను అనుకోవట్లేను. సీఎం తొలుత ఆ గవర్నర్‌తో భేటీ కావాలి. అప్పుడా గవర్నర్ ప్రధానమంత్రిని, రాష్ట్రపతిని కలిసి వారి సలహాలు, సూచనలతో పరిష్కారాలు వెతుకుతారు. కొన్ని సార్లు టెలిఫోన్ సంభాషణలు కూడా సమస్యలను సద్దుమణిగేలా చేశాయి" అని అన్నారు. " సమస్యల పరిష్కారానికి కొన్ని దశాబ్దాలుగా ఇదే విధానాన్ని అవలంభిస్తున్నారు. ఇది కూడా సాధ్యంకాకపోతే తొలుత ప్రతినిధి బృందం రంగంలోకి దిగి గవర్నర్, రాష్ట్రపతితో చర్చలు జరుపుతుంది. కొన్ని సార్లు మధ్యవర్తిత్వం కూడా పనిచేస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు, గవర్నర్ మధ్య సఖ్యత కోసం రాజనీతిజ్ఞత అనేది బాగా అక్కరకొస్తుంది" అని మెహతా వాదించారు. దీనిపై సీజేఐ గవాయ్ స్పందించారు. " ఈ ప్రక్రియలో ఏదైనా తప్పు జరిగితే ప్రత్యామ్నాయంఉండాలి కదా. రాజ్యాంగానికి పరిరక్షకులుగా కోర్టులున్నాయి. అందుకే ఇలాంటి ప్రత్యామ్నాయాన్ని సైతం రాజ్యాంగానికి ఆపాదించేలా ఉండాలి" అని ఆయన అన్నారు. దీనిపై మెహతా మాట్లాడారు. " ఏదైనా అంశాన్ని మనకు అనుగుణంగా ఆపాదించుకోవడం వేరు. రాజ్యాంగానికి సరిపోయేలా చూడడం వేరు. రాజ్యాంగబద్ధ సంస్థలతో ఏదైనా అంశాన్ని పరిష్కరించుకోవాలన్న సందర్భాల్లో కొంత వెసులుబాట్లు కల్పించాలి" అని అన్నారు.

# దక్షిణాదికి న్యాయం చేయండి

ఢిల్లీలో మాట్లాడుతూ జీఎస్‌టి ప్రవేశపెట్టి న సమయంలో రాష్ట్రాల వార్షిక వృద్ధి రేటు 14 శాతంగా ఉండటంతో, వార్షికంగా 14 శాతం వృద్ధి కలుగుతుందని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. వృద్ధి రేటులో లోటును పూరించడానికి, రాష్ట్రాలు స్థిరంగా 14శాతం వృద్ధిని సాధించేందుకు, మొదటి 5 సంవత్సరాల పాటు జీఎస్టీ పరిహారం అందించే విధానం అమలులోకి వచ్చిందని వివరించారు. అయితే, ఇప్పటి వరకు 14శాతం వృద్ధి స్థిరపడలేదని, ప్రస్తుతం రాష్ట్రాల వార్షిక వృద్ధి కేవలం 8 నుంచి 9శాతం మధ్యలోనే ఉందని తెలిపారు. జీఎస్టీ రేట్ల సరళీకరణ, పన్ను భారం తగ్గించడం ఆహ్వానించదగ్గదే అయినప్పటికీ, రాష్ట్రాల ఆదాయాలు క్షీణించకుండా రక్షించే చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.లేకపోతే, పరిహార సెస్సును రద్దు చేసి, సిగరెట్లు, మద్యం, విలాస వస్తువుల వంటి 'సిన్' లేదా లగ్జరీ ఉత్పత్తులపై జీఎస్టీ రేట్లు ప్రస్తుత స్థాయికి పెంచి, అదనంగా లభించే ఆదాయాన్ని రాష్ట్రాలకు కేటాయించాలన్నారు. దీనివల్ల సాధారణ పన్ను చెల్లింపుదారులపై భారం తగ్గడంతో పాటు, పేద, మధ్యతరగతి సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా కొనసాగించగలదని పేర్కొన్నారు. జీఎస్‌టి ప్రవేశపెట్టిన సమయంలో రాష్ట్రాల వార్షిక వృద్ధి రేటు 14 శాతంగా ఉండటంతో వార్షికంగా 14 శాతం వృద్ధి కలుగుతుందని హామీ ఇచ్చారని, కానీ ఇప్పటి వరకు 14 శాతం వృద్ధి స్థిరపడలేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రాల వార్షిక వృద్ధి కేవలం 8 నుంచి 9 శాతం మధ్యలోనే ఉందని తెలిపారు. జీఎస్‌టి సంస్కరణలలో భాగంగా రేట్ రేషనలైజేషన్ ప్రతిపాదనకు మద్దతు తెలిపినా దానికి సరైన పరిహార యంత్రాంగం ఉండాలని భట్టి విక్రమార్క సూచించారు. లేనిపక్షంలో, పేద, మధ్యతరగతి ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, రాష్ట్ర ప్రజల కోసం చేపడుతున్న మౌలిక వసతుల ప్రాజెక్టులు దెబ్బతింటాయని హెచ్చరించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. గురువారం ఢిల్లీలో పార్లమెంట్ లో నిర్మలా సీతారామన్ ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆర్థిక సంబంధిత అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో భట్టి విక్రమార్క తో పాటు తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, రామసహాయం రఘురాం రెడ్డి ఉన్నారు.

# బీజేపీ, డీఎంకేలతో పొత్తు ప్రశ్నే లేదు

వ్యాఖ్యానించారు. తమిళనాడు బలం మొత్తం మనతోనే ఉంది. ఫాసిస్ట్ బీజేపీ, విషపూరిత డీఎంకేకి వ్యతిరేకంగా పోరాడుదాం అంటూ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. 'సింహం ఎప్పుడూ ప్రత్యేకమే. దాని గర్జన 8 కిలోమీటర్ల మేర ప్రతిధ్వనిస్తుంది. వేటకు మాత్రమే బయటకు వస్తుంది. అడవిలో నక్కలు చాలానే ఉంటాయి. సింహం మాత్రం ఒక్కటే. అదే అడవికి రాజు. ఇదే మా స్పష్టమైన ప్రకటన'అని విజయ్ పేర్కొన్నారు. మిస్టర్ నరేంద్ర దామోదర దాస్ మోదీ జీ అంటూ అని సంబోధించిన విజయ్..తమిళనాడు ప్రజల ఆకాంక్షలను బీజేపీ పట్టించుకోవడం లేదన్నారు. అరెస్టయిన తమిళ జాలర్లను విడిపించాలి..కచ్చతీవును తిరిగి స్వాధీనం చేసుకోవాలి, నీట్‌ను రద్దు చేయాలని ఆయన డిమాండ్లు వినిపించారు. బీజేపీది బానిసల కూటమి అని విమర్శలు ఎక్కుబెట్టారు. ఆర్ఎస్ఎస్‌కు బీజేపీ బానిస అని, బీజేపీకి అనేక రాష్ట్ర పార్టీలు బానిసలుగా మారి మైనారిటీ ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఆ బానిసలలో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ టీవీకే ఉండబోదని స్పష్టం చేశారు. అదేవిధంగా, మైడియర్ అంకుల్ అంటూ సీఎం స్టాలిన్‌ను ఉద్దేశించి విమర్శలను ఎక్కుపెట్టారు. మహిళలకు నెలకు రూ.వెయ్యి ఇస్తే సరిపోతుందా? వాళ్ల రోదనలు వినిపించడం లేదా? పరంధుర్ ఎయిర్‌పోర్టుతో భూములు కోల్పోయిన రైతులు, మత్స్యకారుల ఆవేదన ఆలకించారా? మనస్సాక్షి ఉంటే సమాధానం ఇవ్వండని సవాల్ విసిరారు. మైడియర్ అంకుల్ వినిపిస్తుందా ప్రజా గళం? త్వరలో ప్రజల్లోకి వెళ్తున్నా. మనస్సు విప్పి మాట్లాడుతా..ఇక తమరికి నిద్ర కరువైనట్టే అని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలోని మొత్తం 234 స్థానాలలో తానే అభ్యర్థి అని, తనను ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ ఇచ్చిన పార్టీ థర్డ్ గ్రేడ్ పార్టీనా?: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



హైదరాబాద్: భారతదేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన కాంగ్రెస్ పార్టీని థర్డ్ గ్రేడ్ పార్టీ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ ఇచ్చిన పార్టీ కూడా కాంగ్రెసేనని, మీకు థర్డ్ గ్రేడ్ పార్టీలా కనిపిస్తుందా? అంటూ ప్రశ్నించారు. కాంగ్రెస్ ఎటువంటి పార్టీనో మీ తండ్రి కేసీఆర్‌ను అడిగితే చెబుతారన్నారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ దగ్గర గ్రూఫ్ పోటో దిగింది మర్చిపోయారా? అని మంత్రి కోమటిరెడ్డి నిలదీశారు. 'మా పార్టీ పెట్టిన ఉపరాష్ట్రపతి అభ్యర్థిని దేశం మొత్తం హర్షిస్తుంది. సుదర్శన్ రెడ్డి సుప్రీంకోర్టు జడ్జిగా ఉంటూనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం గళం ఎత్తిన న్యాయ కోవిదుడు. తెలంగాణ బిడ్డ ఉప రాష్ట్రపతి అవ్వడం మీకు ఇష్టం లేదు..మీ తెలంగాణ వాదం పై సందేహాలు తలెత్తుతున్నాయి. తెలంగాణ బిడ్డను వ్యతిరేకించిన మిమ్మల్ని తెలంగాణ ప్రజలు క్షమించరు. లక్షల కోట్ల అవినీతి చేసి ఆ డబ్బు ఉందని కళ్ళు నెత్తికెక్కి కాంగ్రెస్ పై మాట్లాడుతున్నావ్. అహంకారపూరితమైన మాటలు ఇక మాట్లాడకు. దేశం కోసం త్యాగం చేసిన గాంధీ కుటుంబం పై చులకనగా మాట్లాడడం..అమెరికాలో చదివిన మీ విజ్ఞతకు వదిలేస్తున్న. నాడు ప్రపంచలోనే ద బెస్ట్ పిఎం అనిపించుకున్నారు రాజీవ్ గాంధీ. రాజకీయంతో సంబంధం లేకుండా దేశ ఐక్యత కోసం భారత్ జోడో యాత్ర చేశారు రాహుల్ గాంధీ. యూరియా ఎందుకు రావట్లేదో అంత మాత్రం తెలియదా?, కేంద్రం ఇవ్వాల్సింది ఇవ్వకుండా చేస్తుంటే అది మాట్లాడక పోగా.. అజ్ఞానంతో మాట్లాడుతున్నావ్' అని ప్రశ్నించారు.



# అతిధుల కోలాహలం మధ్య వర్షిని గౌడ్ జన్మదిన వేడుకలు

### జన్మదిన అభినందనలు తెలిపిన బిజెపి నేత డాక్టర్ నాటి మల్లేష్ గౌడ్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : సంస్థాన్ నారాయణపురం మండలం అల్లం దేవి చెరువు గ్రామ వాసి ప్రముఖ వ్యాపారవేత్త గుండు మల్లేష్ గౌడ్ – సంధ్యారాణి కూతురు వర్షిని గౌడ్ జన్మదిన వేడుకలు గుండు మనోజ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు జన్మదిన వేడుకలకు చౌటుప్పల్ మండల భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షులు డాక్టర్ నాటి మల్లేష్ గౌడ్ హాజరై కుమారి వర్షిని ఆశీర్వదించి జన్మదిన అభినందనలు తెలిపారు. వర్షిని గౌడ్ తో మాట్లాడుతూ విద్యతో పాటు పరివర్తన, నడవడిక, సమాజం పట్ల బాధ్యత, తల్లిదండ్రుల పట్ల గౌరవం, విద్య బోధించే ఉపాధ్యాయుల పైన గౌరవం, తోటి విద్యార్థినీ, విద్యార్థుల పట్ల స్నేహం, సహాయ సహకారాలు వంటి గుణాలను పెంపొందించుకోవాలని డాక్టర్ నాటి మల్లేష్ గౌడ్ తెలిపారు

# పార్లమెంట్ నిరవధిక వాయిదా

బిల్లులు కూడా ఆమోదం పొందాయి. దేశంలో ఆన్‌లైన్ గేమ్స్, సంబంధిత యాప్స్‌పై నిషేధ బిల్లు , సముద్ర జలాల రవాణా సంబంధిత బిల్లు ఆమోదం పొందాయి. రెండు సభలలోనూ సర్ ఎటువంటి చర్చకు వీలులేకుండా అజెండాలకు అడ్డం పడింది. గురువారం చివరి రోజున ఉదయం 11 గంటలకు ముందుగా లోక్‌సభ ఓ సారి సర్ అంశంపైనే వాయిదా పడింది. తరువాత 12 గంటకు కూడా ఇదే పరిస్థితి సాగింది. మధ్యాహ్నం తరువాత స్పీకర్ ఓం బిర్లా లాంఛనపూర్వకంగా ఈ సెషన్ ముగింపు ప్రసంగం చేసి తరువాత సభ నిరవధిక వాయిదా విషయాన్ని ప్రకటించారు. ఇక ఎగువసభ రాజ్యసభ కూడా చివరి రోజున కూడా సర్ వివాదంపై గందరగోళం నడుమ నిరవధికంగా వాయిదా పడింది. సభలో అంతకు ముందు గందరగోళం నడుమ ఎటువంటి చర్చ లేకుండానే ఆన్‌లైన్ గేమ్స్ నిషేధం బిల్లు ఆమోదం పొందింది. పలు కీలక విషయాలపై చర్చకు వీల్లేకుండా పోయిందని ఇది బాధాకరం అని రాజ్యసభ ఉపాధ్యక్షులు హరివంశ్ ఆవేదన వ్యక్తం చేశారు. సభ ఈ విధంగా సాగినందుకు బాధపడుతూ నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు.

# బీఆర్ఎస్ మద్దతు అవసరం లేదు

### ::: కేంద్రమంత్రి కిషన్ కిషన్‌రెడ్డి

ఢిల్లీ: ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో బీఆర్ఎస్ మద్దతు బీజేపీకి అవసరం లేదన్నారు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి. బీఆర్ఎస్ మద్దతు బీజేపీకి ఇవ్వాలని తాము అడగలేదున్నారు. ఇదే సమయంలో పార్లమెంట్‌లో కేంద్రం తెచ్చిన మూడు బిల్లుల విషయంలో ఇండియా కూటమి వ్యవహరించిన తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ బిల్లులకు కాంగ్రెస్ ఎందుకు భయపడుతోందని ప్రశ్నించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. కొందరు నాయకులు బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం నైతిక విలువలను కాపాడేందుకు రాజ్యాంగ సవరణ తీసుకువస్తోంది. ఇందు కోసం లోక్‌సభలో బిల్లు పెట్టాం. దీన్ని ఏకపక్షంగా తీసుకురావాలని అనుకోవడంలేదు. ఈ బిల్లుపై చర్చ జరపాలని జేపీసీకి పంపాం. లోక్‌సభలో పెట్టిన బిల్లు వల్ల దోచుకున్న వారికి కొంత బాధ కలుగుతోంది. కాంగ్రెస్ పార్టీకి ఎందుకు బాధ కలుగుతుందో అర్థం కావడం లేదు. భవిష్యత్తులో జరిగే 3 రాష్ట్రాల ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోరంగా ఓటమి చెందుతుంది. లోక్‌సభలో నిన్న కాంగ్రెస్ కూటమి తీరు దుర్మార్గం. తీవ్రమైన నేరాలపై అరెస్ట్ అయితే ప్రధాని, సీఎం, మంత్రులు పదవీచ్యుతులయ్యే విధంగా బిల్లు తెచ్చాం. రాజకీయాలతో సంబంధం లేని బిల్లు ఇది. కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లుకు ఎందుకు భయపడుతోంది. గుమ్మడి కాయల దొంగ అంటే భుజాలు తడుముకొన్నట్లు కాంగ్రెస్ పరిస్థితి ఉంది. కోర్టు తీర్పు తర్వాతే అమిత్ షా ఎన్నికల్లో పోటీ చేశారు. నైతిక విలువలు కట్టుబడి నాడు అమిత్ షా రాజీనామా చేశారు. ఆరోపణలు వచ్చినప్పుడు స్వచ్ఛందంగా పదవి నుంచి తొలగి పోవాలి. జేపీసీ ముందు అగ్ని పరీక్ష జరగాలి. ఢిల్లీ మద్యం కుంభకోణంలో అరవింద్ కేజ్రీవాల్ ఆరు నెలలుగా పైగా జైలులో ఉన్నప్పుడు అక్కడే అధికారులతో రివ్యూ మీటింగ్‌లు పెట్టారని విమర్శించారు. జైలు నుంచే పాలన చేసి.. ప్రభుత్వ యంత్రాంగాన్ని భ్రష్టు పట్టించారన్నారు. తమిళనాడులో మంత్రి సెంథిల్ బాలాజీ జైలు కెళ్లినా రాజీనామా చేయలేదని తెలిపారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ మద్దతుపై మాట్లాడుతూ.. ఉపరాష్ట్రపతి ఎన్నికలో మాకు బీఆర్ఎస్ మద్దతు అవసరం లేదు. వాళ్ళ మద్దతు ఎవరు అడిగారు. మేం అడగలేదు. 50వేల మెట్రిక్ టన్నుల యూరియా తెలంగాణకు పంపుతున్నాం. తమిళనాడు పోర్టు నుంచి రవాణా జరుగుతుంది. ఇఫ్కో నుంచి 15 వేల మెట్రిక్ టన్నుల యూరియా తెలంగాణకు వస్తుంది. తెలంగాణలో యూరియా లేదు అని మంత్రుల ప్రకటన వల్లే చాలా మంది స్టాక్ పెట్టుకున్నారు. ఈ సమస్యకు మంత్రుల ప్రకటనలే కారణం. దిగుమతుల సమస్యల వల్ల యూరియా కొంత ఆలస్యం జరిగింది' అని చెప్పుకొచ్చారు.

# విద్యా ప్రమాణాల మేరకే ఫీజుల పెంపు

ఆశ్రయించగా కాలేజీల ఫీజుల నిర్ధారణ కోసం సమర్పించిన ప్రతిపాదనలపై ఆరు వారాల్లో నిర్ణయం తీసుకుని ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని టీఏఎఫ్ఆర్సీకీ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, మెంబర్ సెక్రటరీగా ఆచార్య శ్రీరాం వెంకటేష్‌తో పాటు మరో ఆరుగురిని సభ్యులుగా ప్రభుత్వం ఓ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఇతర రాష్ట్రాల్లో విధానాలను పరిశీలించి సిఫారసులు చేసింది. వీటి ఆధారంగా ఫీజు నిబంధనలకు సవరణకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. కాగా రాష్ట్రంలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్‌తో పాటు అన్ని ఉన్నత విద్యా కోర్సులకు గతంలో ఉన్న ఫీజులే అమలు కానున్నాయి. ఎప్‌సెట్ సహా లాసెట్, ఎడ్‌సెట్, పీజీఈసెట్, ఐసెట్, పీఈసెట్‌ల కౌన్సెలింగ్ గత ఏడాది ఫీజులతోనే నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. దీనిని బట్టి బీటెక్, బీఫార్మసీ, ఎంఫార్మసీ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం, బీఈడీ, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, బీపీఎడ్, డీపీఎడ్ తదితర కోర్సుల్లో ప్రవేశాలకు పాత ఫీజులే వర్తించనున్నాయని సమాచారం.

# జైజవాన్ కాలనీ షాపింగ్ కాంప్లెక్స్‌ను స్వాధీనం చేసుకున్న జిహెచ్ఎంసి

### 12 ఏళ్ల పోరాటానికి దక్కిన ఫలితం :తాడూరి



కాప్రా,వార్త మిర్రర్,ఆగస్టు 21:కాప్రా సర్కిల్ ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని జై జవాన్ కాలనీ షాపింగ్ కాంప్లెక్స్ ను ఎట్టకేలకు జిహెచ్ఎంసి స్వాధీనం చేసుకుంది.గురువారం జిహెచ్ఎంసి డిప్యూటీ ఎస్టేట్స్ ఆఫీసర్ లావణ్య కాంప్లెక్స్ లోని 10 షట్టర్లకు తాళాలు వేసి స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ నిధులతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ ఇన్నాళ్లు కాలనీ సంక్షేమ సంఘం ఆధీనంలో ఉండేది.షాపింగ్ కాంప్లెక్స్ స్వాధీనం చేసుకోవడం పట్ల సమాచార హక్కు సాధన సమితి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కన్వీనర్ తాడూరి గగన్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.పన్నెండు సంవత్సరాల పోరాటానికి ఫలితం దక్కిందన్నారు.షాపింగ్ కాంప్లెక్స్ ను స్వాధీనం చేసుకోవాలని గత 12 సంవత్సరాలుగా అనేక సార్లు విజ్ఞప్తులు, ఫిర్యాదులు చేయడం జరిగిందన్నారు.ప్రజా ప్రభుత్వం ప్రారంభించిన ప్రజావాణి ద్వారా సమస్య పరిష్కారమైందన్నారు.ఇందుకు సహకరించిన జిహెచ్ఎంసి ఎస్టేట్ విభాగం అధికారులతో పాటు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.జిహెచ్ఎంసి స్వాధీనం చేసుకున్న కమర్షియల్ కాంప్లెక్స్ లోని షట్టర్లను ఓపెన్ టెండర్ల ద్వారా నిరుద్యోగ యువకులకు కేటాయించాలని ఆయన కోరారు.గత 12 సంవత్సరాలుగా అద్దె రూపంలో వసూలు చేసుకున్న రూ.కోటి రూపాయలను ప్రభుత్వం రికవరీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ విషయమై అవసరమైతే న్యాయపోరాటం చేస్తామని ఆయన అన్నారు.

# మున్సిపాలిటీ వార్డులను శాస్త్రీయంగా విభజించాలి

### - బిజెపి మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి గుర్రాల రాంభూపాల్ రెడ్డి



కల్వకుర్తి ఆగస్టు 21 వార్త మిర్రర్ ప్రతినిధి:-రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కల్వకుర్తి మున్సిపాలిటీలోని వార్డులను క్రమ పద్ధతిలో శాస్త్రీయంగా విభజన చేయాలని బిజెపి నాయకులు కోరారు ఆర్ డి ఓ ఆఫీస్ లో జరిగిన ఓటర్ లిస్ట్ అవగాహన సదస్సులో బిజెపి నాయకులు పాల్గొన్నారు కల్వకుర్తి ఆర్డీవో గా నూతనంగా నియమింపబడిన ఎంపీ జనార్దన్ రెడ్డి గారిని శాలువాతో సత్కరించారు తదనంతరం కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్ లిస్టులో గల పలు సమస్యలను లిఖితపూర్వకంగా అందజేశారు.వారు మాట్లాడుతూ. .మున్సి పాలిటీ పరిధిలో వార్డులను విభజించేటప్పుడు అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా విభజన చేయడం గతంలో జరిగింది.వార్డుల విభజన జరిగేటప్పుడు అన్ని పార్టీల సమ్మతి తీసుకోవాలి. బిఎల్వోలు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని వారిపై తగు చర్యలు చేపట్టాలనీ తిలక్ నగర్ కాలనీ ప్రజలకు స్థానికంగానే పోలింగ్ బూతు ఏర్పాటు చేయాలని ఒక ఇంట్లోని ఓట్లు అన్నీ కూడా ఒకే వార్డులో ఉండేలా చూడాలని 18 ఏళ్ళు నిండిన ప్రతి యువతీ యువకులకు వెంటనే ఓటర్ నమోదు కార్యక్రమం చేపట్టాలనిఇంటి నెంబర్ల ప్రకారం కాకుండా హద్దుల ప్రకారం వార్డులు ఏర్పాటు చేయాలనిపలు సూచనలు చేశారు పై సూచనలు దృష్టిలో పెట్టుకొని ఓటర్ లిస్టులు తయారు చేయాలని ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటే భారతీయ జనతా పార్టీ పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తుందని తెలియజేశారు...ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు గన్నోజు బాబిదేవ్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్,జిల్లా ఉపాధ్యక్షులు బోడ నరసింహ, సీనియర్ నాయకులు, సూర్య కృష్ణ గౌడ్, నీరుకంటి రాఘవేందర్ గౌడ్, నరేడ్ల శేఖర్ రెడ్డి, సురేందర్ గౌడ్, పెద్దారి విజయ్, చందు ముదిరాజ్, పట్టణ ప్రధాన కార్యదర్శి నాప శివ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిద్ధార్థ ఇనిస్ట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫస్ట్ ఇయర్ ఓరియంటేషన్ కార్యక్రమం

### ప్రతిభతో దేశ ప్రగతిని మార్చే ఆయుధాలుగా మారాలి.. డాక్టర్ జి మల్సూర్

### సృజనాత్మకంగా ఆలోచించడం నూతన పరిశోధనల నైపుణ్యాలను ప్రదర్శించాలి: కళాశాల చైర్మన్ డాక్టర్ జి నాగయ్య







రంగారెడ్డి జిల్లా వార్త మిర్రర్ ప్రతినిధి సిద్ధార్థ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ లో ఈరోజు బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల యొక్క ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ జి. మల్సూర్ హాజరయ్యారు. మల్సూర్ విద్యార్థుల నిర్దేశించి మాట్లాడుతూ, మీరు ఇప్పటివరకు గడిపిన జీవితం వేరు ఇప్పటినుండి గడిపే జీవితం వేరు అని చెబుతూ ఇంజనీరింగ్ విద్య మీ జీవితాలనే మార్చి వేస్తుంది బాగా విద్యను అభ్యసించిన వారు గొప్ప గొప్ప ఇంజనీర్లు సైంటిస్టులు అవుతారు కేవలం సాంకేతిక విద్యనే కాక నూతన ప్రమాణాలతో కూడిన మీడియాలతో టెక్నాలజీస్టులుగా కూడా మారవచ్చు అని వివరించారు.ప్రస్తుత పరిస్థితుల్లో సైన్స్ అండ్ టెక్నాలజీలు దేశ మౌలిక పరిస్థితులను మార్చివేసే టూల్స్ గా మారిపోయాయని ఇంజనీరింగ్ లో ప్రతిభను చాటటం వల్ల దేశ ప్రగతిని మార్చే ఆయుధాలుగా మారవచ్చని క్లుప్తంగా వివరించారు.తర్వాత కళాశాల చైర్మన్ డాక్టర్ జి. నాగయ్య మాట్లాడుతూ, గత 15 సంవత్సరాలుగా కాలేజ్ సాధించిన విజయాలను గుర్తు చేస్తూ విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్య ప్రాముఖ్యతను తెలుపుతూ ఇంజనీరింగ్ అంటే కేవలం పుస్తకాలు ఎగ్జామ్స్ మాత్రమే కాదు, సృజనాత్మకంగా ఆలోచించడం ప్రాబ్లంలను పరిష్కరించే పరిజ్ఞానం, నూతన పరిశోధనల నైపుణ్యాలను ప్రదర్శించడం అని విద్యార్థులకు గుర్తు చేశారు. కార్యక్రమ నిర్వాహకులను కళాశాల సెక్రటరీ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ అభినందించారు.ఈ కార్యక్రమంలో మొదటి సంవత్సరం హెచ్ ఓ డి లు డాక్టర్ మారగోనివెంకటేశం, డాక్టర్ టి. కృష్ణార్జున రావు, ఇతర డిపార్ట్మెంట్ హెచ్ ఓ డి లు, ఉపాధ్యాయ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్స్ అందరూ,అన్ని సంవత్సరాల విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# వైటిపిఎస్ భూ నిర్వాసితులకు 335 ఉద్యోగాలు కల్పించినందుకు

### బాణాసంచా కాల్చి స్వీట్లు పంపిణీ సంబరాలు

### సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ చిత్రపటానికి పాలాభిషేకం





మిర్యాలగూడ/దామరచర్ల, ఆగస్టు 21:-( వార్త మిర్రర్) -మిర్యాల గూడ నియోజకవర్గం దామరచర్ల మండలంలోని వీర్లపాలెం వద్ద తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నిర్మాణంలో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించిన సందర్భంగా మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తూ సీఎం రేవంత్ రెడ్డి,డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తంకుమార్రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎమ్మెల్యే బిఎల్ఆర్, ఎమ్మెల్సీ కె. శంకర్ నాయక్ ల చిత్రపటానికి పవర్ స్టేషన్ ఎదుట గురువారం పాలాభిషేకం చేశారు. అనంతరం బాణసంచా కాల్చి స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పవర్ స్టేషన్ కోసం భూములను ఇచ్చి సర్వం కోల్పోయిన 335 మంది భూ నిర్వాసితులకు ఉద్యోగాలు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వంఆదుకుందన్నారు. తమకు ఇచ్చిన హామీ మేరకు గత ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించలేదన్నారు. హామీని నెరవేర్చేల అహర్నిశలు కృషిచేసిన స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఈనెల 25న ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగే బీసీల సత్యాగ్రహదీక్షను విజయవంతం చేయాలి

### బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్..



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ :ఈ నెల 25న జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో జరిగే బీసీ సత్యాగ్రహ దీక్ష సందర్భంగా బేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 25వ తేదీన హైదరాబాద్ లో ఇందిరా పార్క్ వద్ద జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో చేపడుతున్న బీసీల సత్యాగ్రహ దీక్షను వెనుకబడిన తరగతుల ప్రజలు హాజరై మన హక్కుల సాధన కోసం ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని అన్నారు. బీసీలను అణగదొక్కే ప్రయత్నం చేస్తే స్థానిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని అన్నారు. బీసీలంతా ఐక్యమని ఒక్క గళమై గర్జిస్తే మన హక్కులు మనం సాధించుకోవచ్చని అన్నారు. కావున ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించే బీసీల సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలని అన్నారు కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి దొంతిపోయిన శ్రీనివాస్ యాదవ్, కార్యదర్శి సర్వీస్ యాదవ్, కృష్ణ గౌడ్, రాజు ముదిరాజ్, నాయి బ్రాహ్మణ సంఘం రాజేష్, రజక సంఘం కిషోర్, ముదిరాజ్ సంఘం రాజు, మరియు బిసి నాయకులు పాల్గొన్నారు.



### మృతి చెందిన కృష్ణయ్య కుటుంబానికి

# స్ఫూర్తి ఫౌండేషన్ ఆర్థిక చేయూత

### మరో మారు మానవత్వం చాటుకున్న విద్యావేత్త రాపర్తి సురేష్ గౌడ్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన వాల్మీకి కాలనీవాసులు నిరుపేద మండలం పిల్లి కృష్ణయ్య అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ రాపర్తి సురేష్ గౌడ్, మృతి చెందిన కుటుంబానికి దహన సంస్కారాల ఖర్చుల నిమిత్తం 5000/ వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించాలని తెలిపారు. గ్రామ బిఆర్ఎస్ నాయకులు మృతి చెందిన పిల్లి కృష్ణయ్య మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు, అనంతరం స్ఫూర్తి ఫౌండేషన్ చైర్మన్ అందించిన 5000/వేల రూపాయలను పిల్లి కృష్ణయ్య కుటుంబ సభ్యులకు అందించారు ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తెలంగాణ బిక్షం, యాదాద్రి సగర ఆత్మ గౌరవ భవన్ ట్రస్ట్ మెంబర్ రాసాల వెంకటేష్ సాగర్, రాచకొండ గిరి, బోయిని విద్యాకర్, ఉప్పల ఆంజనేయులు, ఎర్రోళ్ల లింగస్వామి, చిలువేరు యాదయ్య, గుజ్జుల మునయ్య, చిలువేరు సత్తయ్య, మండలం యాదయ్య, కిష్ట దుర్గయ్య, చిన్నగిరి, భూపని గణేష్, బోయిని అర్జున్ తదితరులు పాల్గొన్నారు




# కాంగ్రెస్ నాయకులు మునగాల రమణారెడ్డి జన్మదిన వేడుకలు

### ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి సంస్థాన్ నారాయణపురం మండల కాంగ్రెస్ పార్టీ సీని యర్ నాయకులు మునగాల రమణారెడ్డి, జన్మదిన వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ నాయ కుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.తదనంతరం వృద్ధులకు అరటిపండ్లను మరియు స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మహమ్మద్ అక్బర్ అలీ,డిసిసి కార్యదర్శి ఏపూరి సతీష్,యువజన కాంగ్రెస్ అధ్యక్షులు, రెడ్యానాయక్,మాజీ మండల అధ్యక్షుడు నయా ముద్దీన్ ,ప్రముఖ పత్రిక విలేఖరి సింగం కృష్ణ,కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అందె నరేష్ యాదవ్,మినుగు గోపాల్,రాపర్తి బాలయ్య, గుత్తా శేఖర్ రెడ్డి,జక్క నాగభూషణం,జగదీష్,ఇంతటి స్వామి,రాస మల్ల వీరస్వామి, బానోతు కిరణ్ నాయక్,ఏపూరి శివయ్య,కోన్ రెడ్డి యాదయ్య,ఆయన అభిమానులు పాల్గొన్నారు.

### రంగారెడ్డి జిల్లా బిజెపి పార్టీ వైస్ ప్రెసిడెంట్ గా రాధాకృష్ణ యాదవ్..



శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : శేరిలింగంపల్లి నియోజకవర్గం, మాదాపూర్ డివిజన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ గంగల రాధాక్రిష్ణ యాదవ్ ను బిజెపి పార్టీ రంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ గా నియమితులైనట్లు తెలిపారు. రంగారెడ్డి జిల్లా అర్బన్ ప్రజలు నాకు ఇచ్చిన ప్రేమ, గౌరవం, విశ్వాసం నన్ను మరింత బాధ్యతగా మార్చిందనీ, నేను ఈ పదవి స్వీకరించడం ఒక గౌరవం మాత్రమే కాదనీ, ఒక మహత్తరమైన బాధ్యతగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. భారతీయ జనతా పార్టీ ఎప్పటినుండో ప్రజల కోసం, దేశం కోసం, జాతి కోసం పోరాటం చేస్తూనే ఉందనీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం కొత్త దిశగా ముందుకు సాగుతోందనీ, అదే మార్గంలో మన జిల్లా, మన పట్టణం అభివృద్ధి చెందేలా నేను కృషి చేస్తానని,.ప్రతీ ఒక్కరిని కలుపుకుంటూ ఎటువంటి తారతమ్యాలు చూపకుండా ముందుకు నడిచే విధంగా సమన్యాయం పాటిస్తాననీ తెలిపారు. నేను రాజకీయాలలోకి వచ్చింది అధికారానికి కాదు, సేవకోసం. ప్రజల గుండెలో వినిపించే ప్రతి సమస్యే నా వాణిగా మారుతుందనీ, ఒక విద్యార్థి చదువుకోలేక ఇబ్బందిపడితే అది నా బాధగా భావిస్తూ, ఒక యువకుడు ఉద్యోగం కోసం తలుపులు తడితే అది నా కర్తవ్యంగా భావిస్తానని తెలిపారు. ఒక తల్లి తన పిల్లల భవిష్యత్తు గురించి ఆందోళన చెందితే అది నా పోరాటంగా భావించి, ఒక కార్మికుడు తన చెమటకు న్యాయం లేక బాధపడితే అది నా యుద్ధంగా భావిస్తూ మహిళల రక్షణ, గౌరవం కోసం ఎప్పుడూ నిలబడి ఉంటానన్నారు. ప్రజల ఆశీర్వాదం, సహకారం ఉంటే రాబోయే రోజుల్లో రంగారెడ్డి జిల్లా అర్బన్ లో పార్టీ మరింత బలపడుతుందన్నారు.ఈ పదవి నాకు ఇచ్చింది పార్టీ అని, కానీ శక్తి ఇచ్చేది మాత్రం ప్రజలే నని,. మీరు నా వెన్నంటే ఉంటే నేను ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనే ధైర్యం కలిగి ఉంటాననీ పేర్కొన్నారు..నాకు సేవ చేసే అవకాశం కల్పించిన ప్రజలకు, నా సేవలను గుర్తించి రంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ గా భాధ్యతలు అప్పగించిన పార్టీకీ, పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.



# ఓల్డ్ హాపిజ్ పేట్ శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవం

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : గురువారం రోజు ఓల్డ్ హఫీజ్ పేట్ గ్రామము లోని శివాలయంలో నిమ్మల లక్ష్మి నరహరి పటేల్ దంపతుల చేతులమీదుగా శ్రీ శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామివారి కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. ఈ కళ్యాణం మహోత్సవం లో అన్నదాన కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాలింగ్ గౌతమ్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆలయం లో వేద పండితులచే ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో మనీకిరణ్,వెంకటేష్ గౌడ్,శ్రీనివాస్ గౌడ్,రాజారాం,అభిలాష్,సాయి తదితరులతో భక్త మహాశయులు,పాల్గొన్నారు.

# ఆన్లైన్ గేమ్స్ , బెట్టింగ్స్ నిషేధించాలంటూ పార్లమెంటులో ప్రవేశపెట్టడం హర్షణీయం

## సామాజికవేత్త బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి పార్లమెంటులో డబ్బులతో ముడిపడిన ఆన్లైన్ గేమ్స్, బెట్టింగ్స్ నిషేదించాలంటూ పార్లమెంట్లో బిల్లు ప్రవేశపెట్టిన నేపథ్యంలో బిల్లు ఆమోదం పొందడం హర్షనీయం అన్నారు. బిఆర్ఎస్ జిల్లా నాయకులు, సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ నేటి యువతని చెడు మార్గంలో తీసుకు వెళ్తూ వారి కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న ఆన్లైన్ బెట్టింగ్, ఆన్లైన్ గేమ్స్ ని నిషేధించడం పార్లమెంటులో బిల్లు ప్రవేశ పెట్టడం ఇది దేశ యువత భవిష్యత్తు కు ఎంతో అవసరమని అన్నారు. యువత విద్యా ఉపాధి అవకాశాలపై ఆధారపడాలని. నిరుపేద కుటుంబంలో పుట్టిన ప్రతి యువత సన్మార్గంలో నడవాలని మీ తల్లిదండ్రుల కష్టాలకు విముక్తి కలిగించాలని తెలిపారు.

# గుర్తుతెలియని వాహనం ఢీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



మిర్యాలగూడ ,ఆగస్టు 22:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ మండలం కొత్త గూడెం గ్రామం వద్ద నార్కట్ పల్లి - అద్దంకి గురువారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో ఒక గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మరణించాడు. రూరల్ ఎస్ఐ ఎం. లక్ష్మయ్య అందించిన వివరాల ప్రకారం సుమారు 30 నుండి 35వయస్సున్న వ్యక్తి తెలుపు రంగు అంగి, నలుపు రంగు ప్యాంటు ధరించి కొత్తగూడెం జంక్షన్ దగ్గర స్టేట్ హైవే- 2 పైన రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీ కొనగా, అతని ఎడమకాలుకు బలమైన గాయమై విరిగిపోయినది, అతనిని 108 అంబులెన్స్ లో మిర్యాలగూడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో చనిపోయినాడన్నారు. వ్యక్తి ఆచూకీ గాని, గుర్తుపట్టిన వారు గాని ఎవరైనా ఉన్నట్లయితే 8712670189,8712670151 నెంబర్ నకు తెలియజేసి సమాచారం అందించాలని మిర్యాలగూడ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ ఓ కోరారు.

# గణేష్ ఉత్సవాలకు అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి: జోనల్ కమిషనర్ హేమంత్




శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : ఈ నెలలో జరగనున్న గణేష్ ఉత్సవాలతో పాటు నిమజ్జనానికి అత్యంత పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని జోనల్ కమిషనర్ హేమంత్ బోర?డే పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ముందస్తు పటిష్ట ప్రణాళికలతో ముందుకు సాగాలని ఎటువంటి పొరపాట్లు అసౌకర్యాలకు తావు లేకుండా చూడాలని ఆదేశించారు. శేరిలింగంపల్లి జోన్ పరిధిలో గణేష్ ఉత్సవ కమిటీ వారితో మరియు జోనల్ కి సంబంధించిన అధికారులతో మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ కమీషనర్ సహా పలు విభాగాలకు చెందిన అధికారులతో కలిసి గణేష్ ప్రిపరేడెన్స్ మీటింగ్ నిర్వహించి మల్కం చెరువు, గోపి చెరువు, నల్లగండ్ల చెరువు, రాయసముద్రం చెరువు, సాకి చెరువు, గంగారం చెరువు, గౌతమ్ బేబీ పాండ్, కడియం కుంట, దుర్గం చెరువుతోపాటు ప్రధాన ,అంతర్గత రహదారులను శు భ్రపరచాలని ఆయా విభాగాల నడుమ ఎటువంటి సమన్వయ లోపం లేకుండా ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలని, ప్రధానంగా పారిశుధ్య నిర్వహణను అత్యంత పకడ్బందీగా చేపట్టాలన్నారు. వినాయక ప్రతిమల నిమజ్జనానికి బేబీ పాండ్లకు సిద్ధం చేయాలని, వాటిల్లో పేరుకుపోయిన వ్యర్థాలను ముందస్తుగా తొలగించి సంసిద్ధం చేయాలని సూచించారు. శోభాయాత్రలు జరిగే ప్రాంతాలలో రహదారులను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని, పాండ్ల వద్ద విద్యుత్ దీపాలు, సానిటేషన్ సహా అనుబంధ అన్ని ఏర్పాట్లు చేపట్టాలన్నారు. చెరువుల పరిరక్షణకు సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేయాలని, డెంగ్యూ కేసులు గుర్తించ బడిన ప్రాంతాలలో నివారణ చర్యలు చేపట్టాలని ఎంటమాలజీ విభాగాన్ని ఆదేశించారు. సీఎస్ఆర్ కింద పచ్చదనం, పార్కుల నిర్వహణకు చర్యలు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీలు, ఇంజినీరింగ్, పారిశుధ్యం , పట్టణ ప్రణాళిక, ఎంటమాలజీ విభాగాలతో పాటు ఆయా విభాగాల అధికారులు గణేష్ ఉత్సవ కమిటీ కన్వీనర్ మరియు మెంబర్లు ఉన్నారు.



# ది మిర్యాలగూడ రియల్ ఎస్టేట్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పూర్తి కార్యవర్గం

## అధ్యక్ష, కార్యదర్శులుగా ఆకుమర్తి వెంకటేశ్వర్లు, సాజిద్

మిర్యాలగూడ , ఆగస్టు 21:- (వార్త మిర్రర్) మిర్యాలగూడ రియల్ ఎస్టేట్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పూర్తిస్థాయి నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని స్థానిక హౌసింగ్ బోర్డ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఎన్నిక నిర్వహించారు. ఈనెల 16న నూతన కమిటీకి అధ్యక్షుడిగా ఆకుమర్తి వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకోగా, మిగిలిన కమిటీని గురువారం ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా ఎండి సాజిద్, ఉపాధ్యక్షులుగా చిలుముల నరసింహ, షరీఫ్, దైదపద్మారెడ్డి, నాగునాయక్, కార్యదర్శులుగా మన్సూర్, శంకర్, అన్వర్, వెంకటేశ్వర్లు, కోశాధికారిగా కోమల హరి, కార్యవర్గ సభ్యులుగా శంభయ్య, మోయిజ్, పుట్టపాక శ్రీను, భద్యానాయక్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ మీడియేటర్ల సంక్షేమానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ కృషి చేస్తామన్నారు. ప్రభుత్వపరంగా హెల్త్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో సాధిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# శివాని హైస్కూల్లో షీటీం అవగాహన సదస్సు






మిర్యాలగూడ , ఆగస్టు 22:- (వార్త మిర్రర్) : ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల ప్రకారం సిఐ కరుణాకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆదేశాలతో స్థానిక సంతోష్ నగర్ శివాని హైస్కూల్లో విద్యార్థులకు మిర్యాలగూడ షీ టీమ్ వారు మహిళలు, యువతులు, విద్యార్థునిలు, ఉద్యోగిణులకు సమాజంలో ఇంటా బయట బడిలో గుడిలో వీధిలో వారు ఎదుర్కొంటున్న కీచకుల లాంటి పోకిరి గాళ్ల, అవార గాళ్ళ నుండి త్రాగు బోతుల నుండి, డ్రగ్గిస్టుల నుండి ఇలా చెడ్డ మగ వారందరి నుండి ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారాల గురించి వివరించారు. భవిష్యత్తు వారి బాగోగుల గురించి అనేక విషయాలు మగ పిల్లలు త్రాగు బోతులు గాకుండా మత్తుకు బానిసలు కాకుండా చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా దాదాగిరిలకు పోయి రౌడీలు, గుండాలుగా మారకుండా మంచి పౌరులుగా మంచి కుమారులుగా, కుమార్తెలుగా మంచి మార్గంలో నడుచుట కొరకు షీటీంను ఎలా ఉపయోగించుకోవాలి, వారి ద్వారా సమస్యను ఎలా పరిష్కరించుకోవాలన్నారు. డయల్ 100 కాల్ ఏ సమయంలో ఉపయోగించుకోవాలి దాని ప్రాధాన్యత ఉపయోగాల గురించి సమాజంలో జరుగుతున్న సోషల్ మీడియాలో జరుగుతున్న అనేకమైన మోసాల గురించి యువత మత్తు మందులకు బానిసలై జీవితం ఎలా నాశనం చేసుకుంటున్నారో తల్లిదండ్రులు ఎంత బాధ పడుతున్నారో ఎవరు బాగు చేయలేని విధంగా వ్యసనాలకు గురైన కుటుంబాలు వీధిన పడుతున్నాయన్నారు. అలాంటి కుటుంబాల వల్ల అందరికీ బాధే కలుగుతుంది అలా కాకుండా ఎలా ఉంటే మంచిదో ఎలా సహాయం పొందాలో అన్ని అంశాల గురించి పోలీస్ షీటీమ్ వారు చెప్పిన మాటలు విని భవిష్యత్తును చక్క బెట్టుకోవాలన్నారు. మారుతున్న పరిస్థితుల కనుగుణంగా మనం మారి జీవితాలను ఎలా చక్క బెట్టుకోవాలో సక్రమ మార్గంలో ఎలా జీవించాలో అనేక అంశాల గురించి ఎ హైస్కూలు విద్యార్థులకు ఏఎస్ఐ నందిపాటి ప్రభాకర్, హెచ్.రవీందర్ విద్యార్థులకు అనేక అంశాల పై అవగాహన కల్పించారు.



# సరస్వతి శిశు మందిర్ లో 16 ఏళ్లు లోపు విద్యార్థుల అందరికీ టీకా

కల్వకుర్తి ఆగస్టు 21వార్త మిర్రర్ ప్రతినిధి:- శ్రీ సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఆవరణంలో గురువారం విద్యా భారతి అఖిల భారత శిక్ష సంస్థాన్ సూచనల మేరకు 16 సంవత్సరాల లోపు పిల్లలకు పుష్యమి నక్షత్రం రోజున పరిగడుపున ఈ సువర్ణ ప్రాశన (టీకా) వేయడం జరిగిందని పాఠశాల యాజమాన్యం తెలియజేశారు. భారతీయ ఆయుర్వేద శాస్త్రం ప్రకారం ఎదిగే పిల్లల్లో రోగ నిరోధక శక్తిని మెరుగుపరచడమే కాకుండా, జలుబు,దగ్గు,జ్వర0ను నివారిస్తుందని, దీనితోపాటు మేధస్సు,జ్ఞాపకశక్తి, వకృత్వ నైపుణ్యాలను మెరుగుపరుస్తుందన్నారు. జీర్ణక్రియ,వినికిడి శక్తి, దృశ్య లోపాలను సరి చేస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల కార్యదర్శి శ్రీ సాధు మురళీధర్ రెడ్డి గారు మరియు డాక్టర్ జగన్ లాల్ గారు బి ఎం ఎస్ ఎండి ఆయుర్వేదిక్ డాక్టర్ పాల్గొని సువర్ణ ప్రాస యొక్క ప్రాశస్థాన్ని విద్యార్థుల యొక్క తల్లిదండ్రులకు వివరించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు ఆచార్యులు మాతాజీలు పాల్గొన్నారు.

# నవభారత్ సాక్షరత(ఉల్లాస్) కార్యక్రమం ద్వారా అక్షరాస్యతతో పాటు జీవన నైపుణ్యాలు నేర్చుకోవచ్చు






మిర్యాలగూడ, ఆగస్టు 22:-( వార్త మిర్రర్) సమాజంలో జీవితాంతం విద్యాభ్యాసన(ఉల్లాస్, యుఎల్ఎల్ఎస్) ఎన్ఇపి -2020 ప్రకారం సంపూర్ణ అక్షరాస్యత సాధించడానికి ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు వివిధ కారణాలవల్ల 15 సంవత్సరాలు ఆ పైబడిన చదువుకొని వయోజనులందరూ ఈ కార్యక్రమం ద్వారా అక్షరాస్యతతో పాటు కీలకమైన జీవన నైపుణ్యాలు నేర్చుకుంటారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలు, పాఠశాల ఉపాధ్యాయులు, భాగస్వాములవుతారు. పాఠశాలను యూనిట్ గా తీసుకొని హైబ్రిడ్ పద్ధతిలో ఉల్లాస్ కార్యక్రమం నిర్వహించబడుతుంది. రాష్ట్ర సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా ఉల్లాస్ బోధన అభ్యసన సామాగ్రిని రూపొందించడం జరిగింది చదువు నేర్చుకున్న వారికి సర్టిఫికెట్ ఇవ్వబడుతుంది. కార్యక్రమం తరగతి గదులు లైబ్రరీలు డిజిటల్ వనరులు గల సామాజిక చైతన్య కేంద్రాలలో నిర్వహించబడుతుంది.స్వయం సహాయక సంఘాలలో ఎస్ఎస్సి, ఇంటర్ చదువుకున్న మహిళలు వాలంటరీ టీచర్గా వ్యవహరిస్తారు.అవగాహనతో చదవడం, రాయడం అంకెలు గుర్తించడం మరియు కనీస సామర్థ్యాలతో కూడిన లెక్కలు చేయడం నేర్పించారు. నల్గొండ జిల్లాలో నిరక్షరాస్యు లైన సమభావన సంఘ మహిళలు 61779 గా గుర్తించారు. వీరిలో 52,249 మందిని ఉల్లాస్ యాప్ లో నమోదు చేశారు. వీరికి బోధకులుగా 5,049 వాలంటరీ టీచర్లను నమోదు చేశారు. కార్యక్రమం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, జిల్లా విద్యాశాఖ, వయోజన విద్యాశాఖ సహకారంతో అక్షరాస్యులుగా మార్చుటకు గురువారం జిల్లా పరిషత్బాలికల ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి శిక్షణ మిర్యాలగూడ మండల విద్యాధికారి లావూరి బాలు కోర్స్ డైరెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో డిఆర్పి బాలు, ఆర్పీలు రఘు, శ్రీనివాస్ రెడ్డి, వెంకన్న శ్రీశైలం, ఉపాధ్యాయులు విఓఎలు పాల్గొన్నారు



# ఎమ్మెల్యే ను కలిసిన రాయికల్ పట్టణ సంఘమిత్ర యూత్ సభ్యులు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగస్టు 21 : జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ను కలిసిన రాయికల్ పట్టణ సంఘమిత్ర యూత్ సభ్యులు. రాయికల్ పట్టణంలో సంఘమిత్ర యూత్ సొసైటీకి స్థలం ఉందని, అట్టి స్థలంలో సంఘమిత్ర యూత్ ఆద్వర్యం లో దుర్గామాత నవరాత్రి ఉత్సవాల నిర్వహణ కు భవన నిర్మాణానికి నిధుల మంజూరు చేయాలని వినతిపత్రాన్ని అందజేయగా, సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరుకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రవీందర్ రెడ్డి, గన్నె రాజిరెడ్డి, రవీందర్ రావు, సంఘమిత్ర యూత్ అధ్యక్షులు జే.సుధాకర్ రెడ్డి, సభ్యులు పటేల్ శివ , అనిల్, గంగారెడ్డి, సుదర్శన్ రెడ్డి, ముత్యంరాజు, గోపాల్, జిత్తు రంజిత్ రెడ్డి, శ్రీనివాస్, కిరణ్, నాయకులు జగన్ తదితరులు పాల్గొన్నారు.

# దక్షిణ మధ్య రైల్వే ఆతిథ్యమిచ్చిన ఐ ఆర్ ఓ ఎఫ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం




సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఆగస్టు 21..... భారతీయ రైల్వే ప్రమోటి అధికారుల సమాఖ్య (ఐ ఆర్ ఓ ఎఫ్ ) ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం రెండు రోజులపాటు నిర్వహించిన కార్యక్రమం సికింద్రాబాద్ రైలు కళారంగ్లో ప్రారంభమైంది. ఈ సమావేశానికి దక్షిణ మధ్య రైల్వే ఆతిథ్యమిచ్చింది. ఢిల్లీలో ప్రధాన కార్యాలయం కలిగిన ఐ ఆర్ ఓ ఎఫ్ భారతీయ రైల్వేలో పనిచేస్తున్న గ్రూప్-బి ప్రమోటి అధికారుల (సుమారు 60%) ప్రతినిధ్య సంస్థగా కొనసాగుతోంది.సమావేశంలో ప్రమోటి అధికారుల పదోన్నతులు, కెరీర్ అభివృద్ధి, ఉద్యోగ సంబంధిత సవాళ్లు వంటి అనేక అంశాలపై విస్తృత చర్చ జరిగింది.దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజీవ్ కుమార్ శ్రీవాస్తవ, అదనపు జనరల్ మేనేజర్ సత్యప్రకాశ్ తో పాటు వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.జీఎం శ్రీవాస్తవ మాట్లాడుతూ "భారతీయ రైల్వే దేశానికి జీవనాడి. ఇందులో ప్రమోటి అధికారులు వెన్నెముకలాంటివారు. విశేష అనుభవం కలిగిన ఈ కేడర్ సిబ్బంది-ఉన్నతాధికారుల మధ్య వారధి పాత్ర పోషిస్తోంది. ఆవిరి యుగం నుంచి వందే భారత్ ఎక్స్ప్రెస్ వరకు వేగంగా అభివృద్ధి సాధించిన రైల్వే, ఇకపై బుల్లెట్ రైళ్లు నడిపే దిశగా అడుగులు వేస్తోంది" అని తెలిపారు.అదనపు జీఎం సత్యప్రకాశ్ మాట్లాడుతూ, ప్రమోటి అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను రైల్వే బోర్డు అగ్రస్థాయిలో ప్రస్తావిస్తామని హామీ ఇచ్చారు. ఐ ఆర్ .పి.ఓ ఎఫ్ సెక్రటరీ జనరల్ డా. అమిత్ జైన్ సంస్థ కార్యకలాపాలను వివరించారు. ఐ ఆర్ పి ఓ ఎఫ్ అధ్యక్షుడు శ్రీ దీపక్ రాజ్ కూడా సమావేశంలో పాల్గొన్న అధికారులను ఉద్దేశించి ప్రసంగించారు.భారతీయ రైల్వేలో గ్రూప్-ఏ యూపీఎస్సీ ద్వారా నేరుగా నియామకం), గ్రూప్-బి (డిపార్ట్మెంటల్ ప్రమోషన్ల ద్వారా చేరిక) అనే రెండు విధానాలున్నాయి. వీటిలో గ్రూప్-బి అధికారుల తరపున ఐ ఆర్ పి ఓ ఎఫ్ వేదికగా నిలుస్తోంది.ఈ సమావేశంలో 2019 నుండి కొత్తగా ఎంపికైన గ్రూప్-బి అధికారుల పదోన్నతులు ఆలస్యంగా సాగుతున్న విషయం, గ్రూప్-ఏలోకి వారి ఇన్డక్షన్ గణనీయంగా తగ్గిపోవడం వంటి ప్రధాన సమస్యలను ప్రతిపాదించారు. గత 10 ఏళ్లలో రైల్వే ట్రాక్ కిలోమీటర్లు, ఆస్తులు రెట్టింపు అయినా, గ్రూప్-ఏలోకి జరిగే ఇన్డక్షన్ దాదాపు 50 శాతం తగ్గిందని అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సమస్యల పరిష్కారానికి రైల్వే బోర్డు తక్షణ చర్యలు తీసుకోవాలని ఐ ఆర్ పీ ఓఎఫ్ బలంగా కోరింది. ఇప్పటికే ఈ అంశాలపై ఐఆర్ పీఓఎఫ్ నిరంతరం రైల్వే బోర్డు అగ్రాధికారుల దృష్టికి తీసుకువెళ్తోందని నేతలు పేర్కొన్నారు.

## తెలుగు రాష్ట్రాల అవార్డు కో ఆర్డినేటర్‌గా
# డాక్టర్ కాయితి శంకర్ నియమాకం



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగష్టు 21: టొలాసా మెక్సికో అమెరికా యూనివర్సిటీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అవార్డు కో ఆర్డినేటర్ గా డాక్టర్ కాయితి శంకర్ ను నియమిస్తున్నట్లు టొలాసా యూనివర్సిటీ ఇండియా డైరెక్టర్ కట్ట బ్రహ్మాన్ గురువారం డా.కాయితి శంకర్ కు నియమాలక పత్రం అందించినట్లు పత్రిక ప్రకటనలో తెలిపారు. నియమనిబంధనల ప్రకారం మాత్రమే అవార్డు సెలెక్షన్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ కాయితి శంకర్ మాట్లాడుతూ ఎంతోమంది సమాజంలో సేవాకార్యక్రమాలు చేసినప్పటికీ వారికి సరైన గుర్తింపు లభించడం లేదన్నారు. అలాంటి వారిని గుర్తించి యూనివర్సిటీ ద్వారా అంబేద్కర్ ఇంటర్నేషనల్ అవార్డు, డాక్టరేట్ అవార్డును ఇవ్వడానికి టొలాసా యూనివర్సిటీ ముందుకు వచ్చిందన్నారు. తనపై నమ్మకం తో రెండు తెలుగు రాష్ట్రాలు అవార్డు కో ఆర్డినేటర్ గా నియమించి బాధ్యతలు అప్పగించినందుకు ఇండియా డైరెక్టర్ కట్ట బ్రహ్మాన్ కు కృతజ్ఞతలు తెలిపారు.



## రాయికల్ గుడి కోట ఆలయానికి నిధులు ఇవ్వాలని వినతి

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఆగష్టు 21 : జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసిన శ్రీ చెన్నకేశవ పంచముఖ లింగేశ్వర, శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి, శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానం గుడి కోట రాయికల్ ఆలయ కమిటీ సభ్యులు. రాయికల్ గుడికోట దేవాలయం అభివృద్ధి పనులకు నిదులు మంజూరు చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మచ్చ శ్రీధర్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, కార్యదర్శి మహేందర్రెడ్డి ,కోశాధికారి శ్రీనివాస్ ,సంయుక్త కార్యదర్శి అశోక్, ప్రచార కార్యదర్శి బత్తిని నిరంజన్ గౌడ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## ఓయూ ఫ్యాకల్టీ ఆఫ్ లా డీన్ గా ప్రొఫెసర్ ఎన్. వెంకటేశ్వర్లు



సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఆగస్టు 21 ...ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ లా గా ప్రొఫెసర్ ఎన్. వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు ఉస్మానియా విశ్వవిద్యాలయం లా ఫ్యాకల్టీ డీన్‌గా నియమిస్తూ ఓయూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కుమార్ మొలగరం నియా మకపు పత్రాన్ని జారీచేశారు. ఆయన బాధ్యతలు స్వీకరించిన తేదీ నుండి రెండు సంవత్సరాల పాటు ఓయూ లా ఫ్యాకల్టీ డీన్ పదవిలో కొనసాగనున్నారు .ప్రొఫెసర్ బి. విజయలక్ష్మి నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.



## శ్రీ వెంకటేశ్వర స్వామి కమిటీ
## చైర్మన్ గాకళ్లెం నరేష్ గౌడ్ ప్రమాణస్వీకారం

### మామిడిపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ ప్రమాణం

### నూతన కమిటీలతో దేవుడి మాన్యాలకు రక్షణ: లక్ష్మారెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి .... ఆగస్టు 21 ... ప్రతీ ఊరికి బడి- గుడి ఉంటే విద్యతోపాటు ఆధ్యాత్మిక వాతావరణం భవిష్యత్ తరాలకు అలవడుతుందని మహేశ్వరం ని యోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం బడంగ్పేట్ నగర పంచాయతీ మామిడిపల్లి గ్రామంలో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ నూతన చైర్మన్ వైస్ చైర్మన్ గా మహేశ్వరం ని యోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ చేతుల మీదుగా.. ఆలయ కమిటీ అధ్యక్షునిగా కళ్లెం నరేష్ గౌడ్,ని ఆలయ కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది కేఎల్ఆర్ సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు ఈ సందర్భంగా కిచ్చెన్న మాట్లా డుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆలయాల్లో ధూపదీప నైవేధ్యాలకు కరువు లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఆలయ కమిటీలతో అభివృద్ధితోపాటు దేవుడి మా న్యాలు, భూములను పరిరక్షించుకోవాలని సూచించారు. సభ్యులు చెన్నయ్య, శేఖర్, అనితా, భాస్కర్, రాధిక దేవాదాయశాఖ ఉన్నతాధికారులు, ఆలయ ఈవోతోపాటు దేవాదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, మామిడిపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.



## చిలకలగూడ హనుమాన్
## టెంపుల్ ట్రస్ట్ కమిటీ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

సికింద్రాబాద్, వార్తా మిర్రర్ ఆగస్టు 21.... చిలకలగూడ హనుమాన్ టెంపుల్ నూతన ట్రస్ట్ కమిటీ మెంబర్స్ గా ఆదం సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేయించారు. కమిటి చైర్మన్ గా చక్రధర్, మెంబర్స్ గా హరిబాబు, బ్రహ్మాజీ, మన్మథ కుమార్, లక్ష్మి, క్రాంతి కుమార్, ఈవో శ్రీనివాస్, ఎండోమెంట్ ఇన్స్పెక్టర్ ఆండాలమ్మ, సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు.

## గణేష్ నవరాత్రులను, నిమజ్జనాన్ని మతాలకతీతంగా ఆదర్శవంతంగా నిర్వహించుకోవాలి





మిర్యాలగూడ ఆగస్టు 22:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ నియోజకవర్గంలో గణేష్ చతుర్థి నవరాత్రులు, నిమజ్జన కార్యక్రమం రాష్ట్రంలోనే అన్ని మతాల వారు సోదరభావంతో ఆదర్శంగా నిర్వహించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గణేష్ చతుర్థి నవరాత్రులు, నిమజ్జనం సందర్భంగా గురువారం స్థానిక సబ్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలంటే ఏమి చేస్తే బాగుంటుందని ఆలోచించాలన్నారు. మైనారిటీ ముస్లిం, క్రైస్తవులు అన్ని మతాల వారు అన్నదమ్ముల్లా పాల్గొని ఆదర్శంగా నిలవాలని ఆయన కోరారు. ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని ఆయన కోరారు. నవరాత్రి వేడుకల్లో, వినాయక నిమజ్జన కార్యక్రమాలలో అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉండాలని నల్లగొండ అదనపు కలెక్టర్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ ఎం.నారాయణ్ అమిత్ కోరారు. మిర్యాలగూడ డివిజన్ లో వందలాది విగ్రహాలు ఏర్పాటు చేసే అవకాశం ఉందని ఆయన అన్నారు. నవరాత్రులు, నిమజ్జనం కార్యక్రమంలో నిర్వాహకులు, రెవిన్యూ, పోలీసు, విద్యుత్, మునిసిపల్, ఆర్ అండ్ బి, నీటిపారుదల, పంచాయతీ రాజ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని కోరారు. డివిజన్ లోని 5 ప్రాంతాల్లో గణేష్ నిమజ్జన పాయింట్లు ఏర్పాటు చేశామన్నారు. దామరచర్ల మండలం వాడపల్లి కృష్ణా నది, వేములపల్లి మండల కేంద్రం నాగార్జునసాగర్ ఎడమ కాల్వ, అనుముల మండలం ఎడమ కాల్వ 14వ మైలు వద్ద, సాగర్ డ్యాం దిగువన నిమజ్జన కేంద్రాలు గుర్తించామని, వినాయక భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎంపిడిఓలు ఏర్పాట్లు చేయాలని కోరారు. విద్యుత్ శాఖ సిబ్బంది పూర్తి సహకారమందిస్తారని డివిజనల్ ఇంజనీర్ ఎం. శ్రీనివాసచారి అన్నారు. అదేవిధంగా గణేష్ నవరాత్రులు సందర్భంగా డిజెలు ఉపయోగించవద్దని డిఎస్పీ కె.రాజశేఖర్రాజు నిమజ్జనం సందర్భంగా పోలీసులు పూర్తి స్థాయిలో బందోబస్తు నిర్వహిస్తారని ఆయన అన్నారు. నిమజ్జనం ప్రదేశాల్లో బారికేడ్లు ఏర్పాటు చేస్తామని ఆర్ అండ్ బి డిఇఇ అన్నారు. నిమజ్జన ప్రాంతాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని డిప్యూటీ డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ కేసా రవి అన్నారు. సమావేశంలో హిందు ఉత్సవ కమిటి ప్రధాన కార్యదర్శి రేపాల పురుషోత్తంరెడ్డి, బిఎస్పీ నాయకులు కె.రమేష్, ముస్లిం మత బోధకులు మౌలానా మగ్దుం, మౌలానా జావెద్, చిన్న మస్జీద్ అధ్యక్షుడు ఎండి.హాఫీజుద్దీన్, ఖుర్బాన్ అలీ, మొయినుద్దీన్, తహసీల్దార్లు సురేష్ కుమార్, జవహర్, పుష్పలత, సరోజ పావని, రాగ్యానాయక్, ఎంపిడీఓలు ఎం.శేషగిరిశర్మ, డి.జితేందర్ రెడ్డి, ఉమాదేవి, రూరల్ సీఐ పిఎండి ప్రసాద్, ఫైర్ ఆఫీసర్ యాదగిరిలు పాసల్గోన్నారు.

## బడుగుల కోసం స్త్రీ జనోద్దరణకు కలం బట్టిన ఆత్యాధునిక కవయిత్రి
# అనిశెట్టి రజిత మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ
### కాకతీయ యూనివర్సిటీలో అనిశెట్టి రజిత విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి: ఉప్పరి శేఖర్ సగర





హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి : సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర సగర సంఘం ఆధ్వర్యంలో జరిగిన అనిశెట్టి రజిత ఆధునిక కాలం మొల్లఅని, ఆమె బడుగుల కోసం, స్త్రీ జనోద్దరణకు,కార్మికుల,కర్షకుల కోసం కలంబట్టి రాసిన అత్యాధునిక కవయిత్రి అని వక్తలు పేర్కొన్నారు.తొలి మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ లు ప్రధాన వక్తలుగా పాల్గొన్నారు. టి యు డబ్ల్యూ జే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సగర భగీరథ ఆత్మగౌరవ భవన ట్రస్ట్ చైర్మన్ ఆస్కాని మారుతి సాగర్ అధ్యక్షత వహించిన సంస్మరణ సభలో వారు మాట్లాడుతూ స్త్రీల మీద జరుగుతున్న అఘాయిత్యాల మీద, దళితులపై జరిగిన దాడుల మీదనే కాకుండా తెలంగాణ రాష్ట్ర ఆకాంక్ష కోసం ఆమె రాసిన రచనలు ఎందరినో ఆలోచింపచేశాయన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం లో ఉద్యోగిగా ఆమె జీవిత కాలం సేవలందించినందున ఆ విశ్వవిద్యాలయమే నైతికంగా ప్రతి ఏడాది అని శెట్టి రజిత స్మారక ఉపన్యాసాన్ని ఏర్పాటు చేసే పనిని చేపట్టాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో అని శెట్టి రజిత తో కలిసి పని చేసే అవకాశం లభించిందని చెప్పారు. సగర సంఘం ఆధ్వర్యంలో కాకతీయ విశ్వవిద్యాలయంలో అనిశెట్టి రజిత నిలువెత్తు విగ్రహాన్ని పెట్టాలన్నారు. బడుగుల కోసం రాయడమే కాకుండా జీవితకాలం బడుగుల కోసమే పనిచేసిన ధన్యజీవి అనిశెట్టి రజిత అని ఆమెకు నివాళులర్పించారు. ఆధిపత్య కులాల ఆధిపత్యాన్ని తన కలంతో నరికి వేశారని ఆమె కవిత్వాన్ని విశ్లేషించి చెప్పారు. కింది కులాల ఆత్మగౌరవ పతాక అనిశెట్టి రజిత అని పేర్కొన్నారు. ఆమె మరణించినా ఆమె రచనలు మాత్రం బడుగుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని వారు పేర్కొన్నారు. సీనియర్ జర్నలిస్టు గొర్ల బుచ్చన్న మాట్లాడుతూ తొలి విడత ఉద్యమంలోనూ ఎమర్జెన్సీ తదనంతర ఉద్యమాలతో ప్రేరేపితమైన తరంలో వారు ఒకరు అని పేర్కొన్నారు. తెలంగాణలో మహిళలు రాణించేందుకు ప్రేరణ వీరశైవం, ఈ కోణంలోని అనిశెట్టి రజిత సమాజాన్ని అర్థం చేసుకోవడం, సమస్యలకు పరిష్కారం చూపడం నేర్చుకున్నారన్నారు. సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సాగర్ మాట్లాడుతూ సగర జాతిలో ఇలాంటి కవయిత్రి పుట్టడం గర్వకారణమని, ఆమె పేరు పై ప్రతీయేట భగీరథ జయంతి రోజు ప్రత్యేక అవార్డు ఇవ్వనున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సాగర్, సలహాదారులు ఆర్.బి. ఆంజనేయ సాగర్, కోశాధికారి కుమారస్వామి సాగర్, రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షులు మర్క సురేష్ సగర, రాష్ట్ర సగర మహిళా సంఘం అధ్యక్షురాలు గాండ్ల స్రవంతి సగర, వర్కింగ్ ప్రెసిడెంట్ పల్లవి సగర, ఉపాధ్యక్షురాలు సరిత సగర, గ్రేటర్ సగర సంఘం అధ్యక్షులు మోడల రవి సగర, గౌరవాధ్యక్షులు అస్కానీ వెంకట స్వామి సగర, రాష్ట్ర ఉపాధ్యక్షులు మోడల ఆంజనేయులు సగర, శ్రీనివాస్ సగర, రాష్ట్ర నాయకులు గంగాధర్ సగర, చంద్రశేఖర్ సగర, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మర్క సతీష్ సగర, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ సగర తదితరులు పాల్గొన్నారు.



## శ్రావణమాస చివరి గురువారం బోనాలు

మిర్యాలగూడ , ఆగస్టు 22:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ పట్టణం కళాల్ వాడ శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి శ్రావణమాస ఆఖరి గురువారము భక్తజన కోటి అధిక సంఖ్యలో అమ్మవారికి చిరే పసుపు కుంకుమ కొబ్బరికాయ బోనం కోళ్ల యాటలు సమర్పించుకున్నారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ప్రసాద పంపిణీ చేయడమే కాకుండా భక్తులకు ఆటంకం కలగకుండా అన్ని రకాలుగా అన్ని సేవలు చేసారు. కార్యక్రమంలో మెరుగు రోశయ్య బంటు సైదులు బంటు శ్రీను కోలా శ్రీను, లింగంపల్లి శ్రీనివాసు కొంక వెంకన్న లింగంపల్లి మట్టయ్య కోల వెంకన్న బంటు రమేష్ కోల రాంబాబు నక్క శేఖర్) అవదారపు ఈదయ్య పద్మ విజయ కొంక నిర్మల పాల్గొన్నారు

## దామరచర్ల మండలంలోని 2 ప్రాథమిక పాఠశాలలో
## ఫ్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్: ఎంఈఓ బాలాజీ నాయక్



మిర్యాలగూడ , ఆగస్టు 21:- (వార్త మిర్రర్) దామరచర్ల మండలంలో రెండు ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ ఎడ్యుకేషన్ నిర్వహించనున్నట్లు మండల విద్యాధికారి మాలోతు బాలాజీనాయక్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూమండల పరిధిలోని ప్రాథమిక పాఠశాల నర్సాపురం, పెద్దతండలలో ప్రీ ప్రైమరీ తరగతులు నిర్వహించుటకు ప్రభుత్వ అనుమతులు వచ్చాయని ఆయన తెలిపారు. 3 నుండి 5 సంవత్సరాల లోపు విద్యార్థులను నమోదు చేసుకుంటామన్నారు. అంగన్వాడి ఆయాల సంరక్షణలో బోధనోపకరణాల ద్వారా ఆకర్షణీయ తరగతి గదిలో కృత్యాధార బోధన అందించుటకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు



### సుదర్శన్ రెడ్డి స్వగ్రామం మాలగూడ ఆకుల మైలారం
### గ్రామస్తులతో కేఎల్ఆర్: సామాజిక సంఘ సంస్కర్త సుదర్శన్ రెడ్డి

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి .... ఆగస్టు 21 ... రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం మాలగూడ ఆకుల మైలారం గ్రామస్తులతో గురు వారం కేఎల్ఆర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మాత్రమే కాకుండా సంఘ సంస్కర్త, దేశానికి సేవ చేసే సామాజికవేత్తగా. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్. బి. సుదర్శన్ రెడ్డి ని చూడాలని అన్ని పార్టీలకు కాంగ్రెస్ నేత కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి విజ్ఞప్తి చేశారు.ఇవాళ యూపీఏ అభ్యర్థిగా ఉపరాష్ట్రపతి పదవికి నామినేషన్ దాఖలు చేశారు సుదర్శన్ రెడ్డి.ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి పుట్టిన స్వగ్రామం ఆకులమైలారంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలు చేసి గ్రామస్తులతో మాట్లాడారు.భారత రెండో అత్యున్నత ఉపరాష్ట్రపతి పదవికి ఆకులమైలారం గ్రామం నుంచి రైతుబిడ్డ నామినేషన్ దాఖలు చేయటం ఈ ప్రాంత అదృష్టమన్నారు తెలుగు రాష్ట్రాల ఎంపీలు తప్పకుండా జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి విజయం కోసం కృషి చేయాలని కేఎల్ఆర్ విజ్ఞప్తి చేశారు. ఆకులమైలారం గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## ప్రజాపాలనలో అర్హులకు అన్యాయం జరగదు: కెఎల్ఆర్

### ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కిచ్చెన్న మాటమంతీ

వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి .... ఆగస్టు 21 .. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం దాసర్లపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో తలెత్తిన సమస్యలను మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డికి వివరించారు. కందుకూరు మండలం నుంచి పలువురు మహిళా లబ్ధిదారులు.. మార్కెట్ కమిటీ డైరెక్టర్ యుగంధర్ ఆధ్వర్యంలో తుక్కుగూడ కార్యాలయంలో కేఎల్ఆర్ ను కలిశారు.ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ... ఇందిరమ్మ లబ్ధిదారులు, అర్హులైన పేదలకు ఇచ్చే సంక్షేమ పథకాల్లో ప్రజాప్రభుత్వంలో ఎలాంటి అన్యాయం జరగదని హామీ ఇచ్చారు. గత వైఎస్ ప్రభుత్వంలో కట్టుకుని మధ్యలో ఆగిపోయిన ఇండ్లు, టెక్నికల్ ప్రాబ్లమ్స్ తో సీఎం రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో ఆగిన బిల్లులను వెంటనే మంజూరు చేయాలని అధికారులను కిచ్చెన్న కోరారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని లబ్ధిదారులు తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో ఇళ్లకు నోచుకోలేదని వాపోయారు. ఆగిన బిల్లులను వెంటనే మంజూరు అయ్యేలా చర్యలు తీసుకుంటామని కేఎల్ఆర్ హామీ ఇచ్చినట్లు ఇందిరమ్మ లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు